డెస్క్ కొలువు.. రోగాలకు నెలవు

- నైటౌట్లు, టార్గెట్లతో జీవక్రియ అస్తవ్యస్థం
- గతితప్పుతున్న జీవ గడియారం
- హైదరాబాదీల్లో పొట్ట, చెడు కొలెస్ట్రాల్
- ఎన్ఐఎన్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): నిద్రలేవటానికి వేళాపాళా లేదు. పడుకోవడానికీ లేదు. గుడ్లగూబలా రంగుల తెరకు కండ్లప్పగింత! మిట్టమధ్యాహ్నం అయ్యేదాకా మొద్దు నిద్ర!! ఎప్పుడు పడుకుంటామో తెల్వదు. ఎప్పుడు నిద్రలేస్తామో తెల్వదు. ఎప్పుడో కోడి కూయక ముందు లేవాల్సిన వాళ్లం.. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చేదాకా పడుకుంటున్నాం. ఉదయం 8 గంటలకే టిఫిన్ చేయాల్సిన వాళ్లం.. మధ్యాహ్నం 2 గంటల దాకా తినకుండా ఉంటాం. ఇలా జీవక్రియపై ప్రభావం పడి ఆరోగ్యం చెడిపోతుంది. దీన్నే జీవ గడియారం గతి తప్పడం అంటారు. ప్రస్తుత బిజీ లైఫ్ లో అందరి పరిస్థితి దాదాపు ఇదే. యువతకైతే నైటౌ ట్ ఓ సరదా, ఉద్యోగులకైతే నైటౌట్ డ్యూటీలు, వ్యా పారస్థులకు బిజినెస్ ఒత్తిళ్లు.. ఇలాంటి పరిస్థితుల్లో జీవక్రియపై ప్రభావం పడి తక్కువ వయసులోనే హైబీపీ, డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, జాతీయ పోషకాహార సంస్థ చేసిన అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా టికేలు మెటబాలిక్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని వెల్లడైంది. డెస్క్ ఉద్యోగాలు చేసేవాళ్ల జీవనశైలి సాధారణ ప్రజలకంటే భిన్నంగా ఉంటున్నదని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో మూడో వంతు కంటే ఎక్కువ మంది దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని వెల్లడించారు. 183 మంది 30 ఏండ్లలోపు ఐటీ ఉద్యోగులను నమూనాగా తీసుకొని వారి జీవనశైలిలో వచ్చిన మార్పులను పరిశీలించగా, మూడో వంతు మంది మెటబాలిక్ సిండ్రోమ్ బాధితులేనని వివరించారు. హైదరాబాద్ టికేల్లో పొట్ట, చెడు కొలెస్ట్రాల్, లో బయోమేకర్స్ స్థాయిలను కనుగొన్నట్టు తెలిపారు. వారానికి 150 నిమిషాల శారీరక శ్రమ కూడా చేయటం లేదని చెప్పారు. పోషకాహారం తీసుకోకపోవటం, పండ్లు, కూరగాయలు తినకపోవటం, సమయాన్ని బట్టి ఆహారాన్ని తీసుకోకపోవటం, బయటి ఆహారాన్ని తిని పూట గడిపేయటం వంటి కారణాలతో జీవక్రియ దెబ్బతింటున్నదని వివరించారు.

పెరుగుతున్న ఒత్తిడి

30 ఏండ్ల లోపు ఉద్యోగుల్లో ఒత్తిడి తీవ్రత ఎక్కువగా ఉన్నదని, ఫలితంగా చిన్న వయసులోనే దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఈ సమస్యలు తీవ్ర రోగాలకు కారణం అవుతాయని హెచ్చరించారు. ఒత్తిడి, మానసిక వ్యథ, హైబీపీ, ఊబకాయాన్ని దూరం చేసే జీవనశైలిని అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఉద్యోగుల కోసం ఆఫీసుల్లో వెల్‌నెస్ కార్యక్రమాలను ప్రోత్సహించాల్సి అవసరాన్ని నొక్కి చెప్పారు.

29న ఎమ్మెల్సీ ఎన్నికలు

- రెండు స్థానాలకు షెడ్యూల్ విడుదల
- ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు
- ఈ నెల 11 నుంచి నామినేషన్ల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అయిన రెండు సీట్లకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎలక్షన్ కమిషన్ గురువారం షెడ్యూల్ ప్రకటించింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి గెలుపొందారు. దీంతో వీరిద్దరూ శాసనమండలికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వీరి స్థానాలను భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 29న పోలింగ్ నిర్వహించనుంది. ముందుగా జనవరి 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. జనవరి 18న నామినేషన్ల గడువు ముగుస్తుంది. జనవరి 19న నామినేషన్లను పరిశీలించనుండగా.. ఉపసంహరణకు 22వ తేదీని గడువుగా నిర్ణయించారు. పోలింగ్ 29న ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుంది. అదే రోజు సాయంత్రం అయిదు గంటల నుంచి ఓట్లను లెక్కించనున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ఫిబ్రవరి ఒకటో తేదీనాటికి పూర్తిచేయాలని ఎన్నికల సంఘం పేర్కొన్నది.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు చెరొకటి..?

శాసనమండలిలో రెండు స్థానాలకు జరుగనున్న ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. రెండు స్థానాలను గెలుచుకొనేంత బలం అధికార కాంగ్రెస్ పార్టీకి లేదు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెరో స్థానం గెలుచుకొనే అవకాశం ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. ఒకవేళ పోటీ అనివార్యమైతే ఒక్కో స్థానం గెలువడానికి కనీసం 40.6 ఓట్ల చొప్పున కావాలి. రెండు స్థానాలు గెలువడానికి 81.2 మంది ఎమ్మెల్యేల ఓట్లు కావాలి. కానీ కాంగ్రెస్‌కు 65 మంది ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు ఎంఐఎం సహకరించే అవకాశాలున్నాయి. అప్పుడు బీఆర్ఎస్ కచ్చితంగా ఒక స్థానాన్ని గెలుచుకోవచ్చు. బీజేపీ కూడా అభ్యర్థిని బరిలోకి దింపితే ఎన్నికల ప్రక్రియ మరింత సులువుగా పూర్తవుతుంది. అప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందుతారు. బీజేపీ పోటీకి దిగకుండా పోలింగ్‌కు గైర్హాజరైతే అప్పుడు బరిలో నిలిచిన అభ్యర్థికి 38 ఓట్లు సరిపోతాయి. ఇక ఎంఐఎం కూడా గైర్హాజరైతే ఒక్కో అభ్యర్థికి 36 ఓట్లు వస్తే సరిపోతుంది. బీజేపీ, ఎంఐఎంలు కాంగ్రెస్‌కు సహకరించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చెరొక స్థానాన్ని గెల్చుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

బీఆర్ఎస్ నుంచి ఎవరు..?

బీఆర్ఎస్ పార్టీలో కూడా ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉత్సుకత నెలకొన్నది. అయితే, ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ సమీక్షలు నడుస్తుండటం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇప్పుడిప్పుడే కోలుకుంటుండటంతో ఎవరి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తారన్నది ఇంకా తేలలేదు. అయితే, పార్టీ కోసం కష్టపడిపనిచేసిన వారికి అవకాశం ఇస్తారని, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నందున ప్రజాసమస్యలను బలంగా వినిపించేవారికి, సామాజిక సమతూకం ఉండేలా నిర్ణయం ఉంటుందని నేతలు చెప్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థి ఎవరనేదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

కాంగ్రెస్ నుంచి ఆశావహులు ఎందరో

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో కాంగ్రెస్ పార్టీలో చాలామందికి కొత్త ఆశలు చిగురించాయి. శాసనసభ ఎన్నికల్లో పోటీచేసి ఓడిన వారు, టికెట్ దక్కనివారు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరులు టికెట్‌ను ఆశించేవారి జాబితాలో ఉన్నారు. ప్రధానంగా షబ్బీర్ అలీ తనకే ఎమ్మెల్సీ టికెట్ దక్కుతుందని, తాను గెలిస్తే మంత్రి వర్గంలో కూడా చేరుతానని ధీమాతో ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం లేకపోవటంతో కచ్చితంగా తనకే ఎమ్మెల్సీ టికెట్ దక్కుతుందని అంజన్‌కుమార్ యాదవ్ భావిస్తున్నారు. మైనంపల్లి హన్మంతరావు, ఫిరోజ్‌ఖాన్, హరికర వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి వెన్నంటి ఉన్న అద్దంకి దయాకర్, వేం నరేందర్‌రెడ్డి కూడా ఆశావహుల్లో ఉన్నారు. సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కూడా ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీని నమ్ముకొని ఉన్నానని, తెలంగాణలో పార్టీ విజయం సాధించేందుకు తానుకూడా కష్టపడ్డానని చెప్తున్నారు. యువజన కాంగ్రెస్ కోటాలో తనకు సీటు ఇస్తారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆశాభావంతో ఉన్నారు.

లోకం పోకడ

అమెరికా సంస్థతో ఏపీ విద్యాశాఖ ఒప్పందం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : ఏపీ ప్రభుత్వం ఉన్నత విద్యలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు అమెరికా సంస్థతో మరో ఒప్పందం కుదుర్చుకొన్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 12 లక్షల మంది విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొనేలా ఎడ్యుకేషన్ సబ్‌స్క్రిప్షన్ క్యాటలాగ్ పేరిట ఆ రాష్ట్ర ప్రభుత్వం అమెరికాకు చెందిన ఈడీఎక్స్ ఎల్ఎల్‌సీ అనే సంస్థతో ఒప్పందం చేసుకొన్నది. ఈ మేరకు వివిధ కోర్సులు, సర్టిఫికేషన్ జారీ చేసేందుకు వీలుగా నామినేషన్ ప్రాతిపదికన ఈడీఎక్స్ సంస్థకు 6 మిలియన్ యూఎస్ డాలర్లు చెల్లించనున్నది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	12.6°c	30.7°c
రంగారెడ్డి	13.9°c	31.8°c
మెదక్	14.5°c	30.6°c
నల్లగొండ	16.5°c	32.2°c
వరంగల్	17.0°c	29.0°c
ఖమ్మం	17.0°c	30.0°c
నిజామాబాద్	17.2°c	29.9°c
కరీంనగర్	18.0°c	29.0°c
హైదరాబాద్	18.7°c	28.6°c
మహబూబ్‌నగర్	19.5°c	30.0°c

స్పెషల్ ఆఫీసర్లా? పర్సన్ ఇన్‌చార్జీలా?

- వచ్చే నెల 1తో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల గడువు
- గణన నిర్వహించకపోవడంతో ఎన్నికలకు అడ్డంకులు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం వచ్చే నెల 1తో ముగియనున్నది. ఈలోగా ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపించడం లేదు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి సన్నాహాలూ, ఏర్పాట్లు ప్రారంభించలేదు. దీంతో పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా? ఇప్పుడున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే బీసీ గణనను తప్పనిసరిగా చేసి వారికి రిజర్వేషన్లు కేటాయించాలని గత ఎన్నికల సమయంలోనే సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బీసీ గణనకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి కదలిక లేదు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేసి ఆ లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు, పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి అప్పగించాల్సి ఉంటుంది. ఇవన్నీ వచ్చే నెల 1 నాటికి పూర్తి చేయడం అసాధ్యం. దీంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన అమలు చేయడం లేదా సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించడం తప్పనిసరి కానున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాలేదు. ఒకవేళ పర్సన్ ఇన్‌చార్జీలను కాకుండా స్పెషల్ ఆఫీసర్‌లను నియమించాలని ప్రభుత్వం భావిస్తే.. మండలంలోని గెజిటెడ్ అధికారులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు.

యూపీ, ఎంపీలో...

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనూ పంచాయతీల గడువు ముగిసినా బీసీ గణన చేయకపోవడంతో ఎన్నికల నిర్వహణపై అక్కడ కొందరు కోర్టులను ఆశ్రయించారు. బీసీ గణన చేయకుంటే ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే సీట్లు కాకుండా ఇతర సీట్లన్నింటిని జనరల్ సీట్లుగా పరిగణించి ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో బీసీల నుంచి తీవ్ర ఆగ్రహం రావడంతో ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీ గణన చేపట్టి ఎన్నికలు నిర్వహించాయి.

గతంలో సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించిన సందర్భాలు..

- ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో 12-6-1986 నుంచి 30-3-1988 వరకు సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించారు.
- 1-4-1993 నుంచి 22-10-1995 వరకు సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించారు.
- చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 22-10-2000 నుంచి 23-8-2001 వరకు సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించారు.

డీపీఆర్‌ల బిల్లులు చెల్లించండి

- తెలంగాణకు వ్యాప్కోస్ లేఖ

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): వివిధ ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి వ్యాప్కోస్ సంస్థ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం లేఖ రాసింది. వార్ధా, సీతారామ, మల్లన్నసాగర్, గోదావరిపై లైడార్ సర్వే, కాళేశ్వరం ప్రాజెక్టు ఇలా మొత్తం తొమ్మిది ప్రాజెక్టుల డీపీఆర్‌లను వ్యాప్కోస్ సంస్థ తయారీ చేసింది. అందుకు రూ.14.25 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్‌కు వ్యాప్కోస్ సంస్థ లేఖ రాసింది.

కేఆర్ఎంబీ నిర్వహణకు పైసల్లేవ్

- ఆర్థికాంశాలపై 12న ప్రత్యేకంగా వర్చువల్‌గా బోర్డు సమావేశం

హైదరాబాద్, జనవరి4 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) నిర్వహణకు పైసల్లేకుండాపోయాయి. బోర్డులోని ఉద్యోగుల జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. కేఆర్ఎంబీ నిర్వహణకు ప్రతి సంవత్సరం తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు సగటున రూ.3.50 కోట్ల చొప్పున నిధులను విడుదల చేస్తున్నాయి. ఈ ఏడాది నిధులను రెండు రాష్ట్రాలు కూడా విడుదల చేయకపోవడంతో బోర్డు నిర్వహణకు డబ్బులు లేకుండాపోయాయి. ఎన్నికల ముందు ఎమర్జెన్సీ ఫండ్ కింద రూ.1 కోటి నిధులను బోర్డుకు కేటాయించగా, బోర్డు ఉద్యోగుల వేతనాలను ఈ నెల ఆ నిధుల నుంచే చెల్లించారు. ఈ నేపథ్యంలో నిధుల విడుదలపైనే ఇరు రాష్ట్రాలతో ఈ నెల 12న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని బోర్డు చైర్మన్ నిర్ణయించినట్టు తెలిసింది. వర్చువల్‌గా ఇరు రాష్ట్రాలతో బోర్డు నిధులపై చర్చించేందుకు సమాయత్తమవుతున్నారు.

అఖిల భారత సమావేశానికి డీజీపీ రవిగుప్తా

- 'బెస్ట్ పోలీస్‌స్టేషన్' అవార్డు అందుకోనున్న రాజేంద్రనగర్ సీఐ
- రాజస్థాన్‌లోని జైపూర్‌లో మీటింగ్.. ముఖ్యఅతిథిగా ప్రధాని మోదీ

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే 'డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్' అఖిలభారత సమావేశానికి రాష్ట్ర డీజీపీ రవిగుప్తా హాజరుకానున్నారు. ఇప్పటికే ఆయన జైపూర్ చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సమావేశాల్లో సైబర్ క్రైమ్, పోలీస్ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం, ఉగ్రవాద నిరోధంలో ఎదురవుతున్న సవాళ్లు, వామపక్ష తీవ్రవాదం, జైళ్ల సంస్కరణలు తదితర అంశాలపై చర్చిస్తారు. కొత్త చట్టాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్ సాంకేతికత దుర్వినియోగంపై నిపుణులతో చర్చించి, సరైన పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. దేశవ్యాప్తంగా ఎంపికైన మూడు ఉత్తమ పోలీస్‌స్టేషన్ల హెస్‌హెచ్‌వోలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తొలిరోజే అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ క్యాటగిరీలో ప్రథమ స్థానంలో నిలిచిన మన రాష్ట్రంలోని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బీ నాగేంద్రబాబు అవార్డును అందుకోనున్నారు.

మేడిగడ్డలో భూగర్భ పరీక్షలు

- ఈఆర్ఎం పద్ధతిలో దర్యాప్తు ప్రారంభం
- 60 హెచ్‌పీ పంపులతో నీళ్ల తోడివేత
- పరీక్షలకు వారం పట్టే అవకాశం
- ఎల్అండ్‌టీ నేతృత్వంలోనే పనులు
- సుందిళ్ల బరాజ్‌లో లీకేజీలు బంద్
- అన్నారం బరాజ్‌లో గ్రౌటింగ్ పూర్తి

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్‌లోని 20వ పిల్లర్ కుంగుబాటుకు గల కారణాలను తెలుసుకునేందుకు సంబంధించిన దర్యాప్తు ప్రక్రియ గురువారం ఉదయం ప్రారంభమైంది. ఎల క్ట్రోరల్ రెసిస్టివిటీ మెథడ్(ఈఆర్ఎం)ను ఉపయోగించి భూగర్భ పరీక్షలను నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీబరాజ్ (మేడిగడ్డ) 7 బ్లాక్‌లోని 20 పిల్లర్ గత అక్టోబర్‌లో కుంగుబాటుకు గురైన విషయం తెలిసిందే. అందుకు గల కారణాలు తెలుసుకొనేందుకు ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించారు. ఇన్వెస్టిగేషన్ ప్రక్రియ కోసం ఇప్పటికే కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులను కూడా బరాజ్ నిర్మాణ ఏజెన్సీ ఎల్అండ్‌టీ చేపట్టింది. కుంగుబాటుకు గురైన ప్రాంతంలో 60 హెచ్‌పీ మోటర్లను పెట్టి నీటిని తోడేస్తున్నది. గురువారం ఉదయం నాటికి బరాజ్ బెడ్ లెవల్ వరకు నీటిని తొలగించినట్టు సమాచారం. బరాజ్ కుంగుబాటుకు గల కారణాలను తెలుసుకునేందుకు ఎల్అండ్‌టీ.. మరో కంపెనీతో ప్రాథమిక పరీక్షలు చేయిస్తున్నది. తొలుత కుంగుబాటుకు గురైన 7వ బ్లాక్ వద్ద పరీక్షలు నిర్వహించి, తదుపరి అన్ని బ్లాక్‌లలో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

ఈఆర్ఎం అంటే..

బరాజ్ కుంగుబాటుకు కారణాలను తెలుసుకునేందుకు ఈఆర్ఎంను ఉపయోగిస్తున్నారు. విద్యుత్తు నిరోధకత ఆధారంగా భూగర్భ పరీక్షలను నిర్వహిస్తారు. విద్యుత్తు ప్రవాహం అన్నింట్లో ఒకేలా ఉండదు. ఇసుకలో, నీళ్లలో, ఒక్కో రకం పదార్థంలో ఒక్కో తీరుగా, ఒక్కో వేగంతో ప్రవహిస్తుంది. ఇలా విద్యుత్తు ప్రవాహాన్ని బట్టి భూగర్భంలో ఎలాంటి పదార్థం ఉన్నదో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఇదే పద్ధతిని అనుసరించి బరాజ్ పునాదిని అధికారులు పరీక్షిస్తున్నారు. పునాది కింద భూగర్భంలో వచ్చిన మార్పులను అంచనా వేయనున్నారు. మొత్తంగా ఈ ప్రక్రియ వారం పాటు కొనసాగనున్నదని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ పరీక్ష ఫలితాల అనంతరం పునాదిని తెరిచే అవకాశం ఉన్నది.

సుందిళ్లలో లీకేజీలు బంద్

మేడిగడ్డ ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా పలు చోట్ల లీకేజీలు ఏర్పడిన విషయం తెలిసిందే. సుందిళ్లలో రెండు చోట్ల, అన్నారంలో నాలుగు చోట్ల లీకేజీలు బయటపడ్డాయి. ఇప్పటికే అక్కడ అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. అందుకు సంబంధించిన బాధ్యతలను ఇప్పటికే డైనోసర్ అనే కంపెనీకి అప్పగించారు. ఆ కంపెనీ ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టింది. సుందిళ్లలో రెండు చోట్ల ఏర్పడిన లీకేజీలను విజయవంతంగా అరికట్టింది. గ్రౌటింగ్ పూర్తి చేసింది. అన్నారంలోనూ గ్రౌటింగ్ పూర్తి చేసింది. అయితే లీకేజీలకు గల కారణాలను తెలుసుకునేందుకు ఈ బరాజ్‌ల వద్ద దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధమవుతున్నది.

తిట్టబోతే అక్క కూతురు.. కొట్టబోతే కడుపుతో ఉంది!

- కాంగ్రెస్ సర్కార్‌ను ఏమీ అనలేకపోతున్నాం
- రాష్ట్రంలో సీపీఐ పరిస్థితిపై నారాయణ వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తమ పార్టీ వైఖరి.. 'తిట్టబోతే అక్క కూతురు.. కొట్టబోతే కడుపుతో ఉంది' అన్నట్టు ఉన్నదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కే నారాయణ వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ మద్దతు ఇచ్చింది. కాంగ్రెస్ మద్దతుతో కొత్తగూడెం ఎమ్మెల్యేగా సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు గెలిచారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సీపీఐ ఏమీ అనలేని పరిస్థితి నెలకొందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు సన్నాహకంగా సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దేశంలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయని, ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి బలపడుతున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తప్పిదాల వల్లనే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో గెలుపొందిందని అన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభించి ఓట్లు దండుకోవాలని బీజేపీ భావిస్తున్నదని చెప్పారు. పార్లమెంట్‌పై పొగ బాంబు దాడి జరిగితే జవాబు చెప్పలేని బీజేపీ 148 మంది ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేసిందని విమర్శించారు. అదానీని అన్ని విషయాల్లో బీజేపీ కాపాడుతున్నదని, అందుకే అదానీ అకౌంట్లపై సెబీ అభ్యంతరం చెప్పినా.. సుప్రీంకోర్టు ద్వారా గడువు కల్పించారని ఆరోపించారు. వైఎస్ షర్మిలను ఏపీ కాంగ్రెస్‌లోకి తీసుకుని జగన్‌ని భయపెట్టారని చెప్పారు. ఏపీలో జగన్ సర్కారు పోవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

సాగర్ నుంచి ఏపీకి 5 టీఎంసీలు!

- కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సూత్రప్రాయ నిర్ణయం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ నుంచి ఏపీకి ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశంపై గత అక్టోబర్‌లో నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశం అప్పటికి అందుబాటులో ఉన్న జలాల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించింది. ఆ తరువాత ఎలాంటి ఇండెంట్ పెట్టకుండానే నవంబర్ 29న అర్ధరాత్రి 100 మంది పోలీసులతో ఏపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఆక్రమించింది. కుడికాలువ గేట్లను తెరిచి నీటిని తరలించుకుపోవడం ప్రారంభించింది. తెలంగాణ అభ్యంతరాలు తెలపడం, కేంద్రం జోక్యంతో ఏపీ అప్పుడుగానీ డ్యామ్ నుంచి 5 టీఎంసీల జలాలను విడుదల చేయాలని కేఆర్ఎంబీకి ఇండెంట్‌ను పెట్టలేదు. ఏపీ ఇండెంట్ ప్రతిపాదనలపై అభిప్రాయం తెలపాలని బోర్డు తెలంగాణకు లేఖకు రాసింది. ఈ నేపథ్యంలో వేసవి తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని నీటి విడుదలపై బోర్డే నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ వెల్లడించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏపీకి 5 టీఎంసీలను విడుదల చేయాలని కేఆర్ఎంబీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు సమాచారం. నేడో, రేపో ఈ మేరకు రిలీజ్ ఆర్డర్ వచ్చే అవకాశం ఉన్నది.

గ్రేటర్‌పై మంచు దుప్పటి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చలిగాలుల ప్రభావం కొనసాగుతున్నది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోవడంతో ఉదయం వేళలో దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్నది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ 28.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.7 డిగ్రీలు, గాలిలో తేమ 55 శాతంగా నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

జిల్లాజడ్జి పోస్టుకు తెలంగాణ న్యాయవాదులే అర్హులు

నాంపల్లి కోర్టులు, జనవరి 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని అన్ని జిల్లా కోర్టుల్లో జిల్లా జడ్జీల పోస్టులకు తెలంగాణ కోర్టుల్లో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులే అర్హులని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. ఇతర రాష్ట్రాల్లో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులు అర్హులు కాదని తెలిపింది. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ నిబంధనలు-2023లోని వ్యాలిడిటీ ఆఫ్ రూల్స్ 5(1)(ఎ)ప్రకారం ఈ నిబంధనలు వర్తిస్తాయని తీర్పులో పేర్కొన్నారు. స్థానిక కోర్టుల్లో